## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- పరిశ్రమల స్థాపనతోనే సంపద సృష్టి జరుగుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.

- రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

- తిరుమలలో మెరుగైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయడం అవసరమని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరిష్ కుమార్ గుప్తా అన్నారు.

- రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు అన్ని జిల్లా కేంద్రాల్లోనూ జరుగుతున్నాయి.

- నైరుతి రుతుపవనాల ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

===================

పెట్టుబడులకు రాజధాని అమరావతి ప్రధాన కేంద్రంగా ఉండబోతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. న్యూ ఢిల్లీలో ఈ రోజు భారత పరిశ్రమ సమాఖ్య (సీఐఐ) వార్షిక వ్యాపార సదస్సులో ఆయన ముఖ్య ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమరావతిలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను కోరారు. పరిశ్రమల ఏర్పాటుతోనే సంపద సృష్టి జరుగుతుందని అన్నారు. సంపదతో వచ్చే ఆదాయంతోనే సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించగలమని చెప్పారు. 1990 దశకంలో అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశ గతిని మార్చాయని గుర్తు చేశారు. ఇంటర్ నెట్ విప్లవంతో భారతదేశం ప్రపంచంలో ముఖ్య భూమిక పోషిస్తోందని అన్నారు. దేశంలోని మానవ వనరులు భారత్ అభివృద్ధిలో కీలకంగా ఉన్నాయని చంద్రబాబునాయుడు పేర్కొంటూ..

(వాయిస్ బైట్... 32సెకన్లు)

===================

అంతర్జాతీయ స్థాయిలో తిరుమలకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని మెరుగైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయడం అవసరమని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరిష్ కుమార్ గుప్తా తెలిపారు. దేశంలో ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తిరుమలలో భద్రతను మరింత బలోపేతం చేయాలన్న అంశంపై స్థానిక అన్నమయ్య భవనంలో ఈరోజు ఉన్నత స్థాయి భద్రత సమావేశం నిర్వహించారు. డీజీపీ హరిష్ కుమార్ గుప్తా, తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ కార్యనిర్వహణాధికారి జె. శ్యామల రావు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ స్థానిక పోలీసులు, టీటీడీ సెక్యూరిటీతోపాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే విపత్తు నిర్వహణ బృందం ఏర్పాటుపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

===================

రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఈరోజు ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, మొదటగా 22 ప్రధాన ఆలయాలలో నిత్య అన్నదాన కార్యక్రమం చేపడతామని, ఆ తరువాత 166 దేవాలయాల్లో ఆ కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్ణయించామని తెలిపారు. అదే విధంగా దూప, దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలను సైతం అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్...31 సెకన్లు)

===================

యోగా.. పూర్వీకులు అందించిన గొప్ప ఆస్తి అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవడం కోసం యోగాను దినచర్యగా చేసుకోవాలని కోరారు. విజయనగరంలోని ఆధ్యాత్మిక క్షేత్రమైన రామనారాయణంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈరోజు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యోగా పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

===================

నిత్య జీవితంలో యోగా అనేది సర్వ రోగాల నివారణకు ఉపయోగపడుతుందని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల శాసనసభ్యులు ఎన్. ఈశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగాంధ్ర పేరిట నెల రోజుల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఎచ్చెర్ల నియోజకవర్గంలో రణస్థలం, లావేరు మండలాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

===================

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా సంజీవనిలా పని చేస్తుందని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా భీమవరంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్ర ప్రాంగణంలో ఈరోజు జరిగిన యోగ అభ్యసన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగరాణి పాల్గొన్నారు.

===================

విరామం

===================

వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ ఎన్ మల్లేశ్వరి తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు పుట్లూరు, గుత్తి, నల్లమాడ మండలాలకు సంబంధించిన గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా, క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కలిపిస్తామని ఆమె పేర్కొంటూ..

(వాయిస్ బైట్...32 సెకన్లు)

===================

శ్రీకాకుళం జిల్లాలో అక్రమ మద్యం అమ్మకాలను అరికడుతున్నామని జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సహాయ కమీషనర్ పైడి రామచంద్రరావు తెలిపారు. అలాగే నాటు సారా వినియోగాన్ని నియంత్రిస్తున్నామని పేర్కొన్నారు. వీటికి సంబంధించి 1537 కేసులు నమోదు చేసి 1467 మందిని అరెస్టు చేశామని చెప్పారు. శ్రీకాకుళంలో ఈరోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో గడిచిన ఎనిమిది నెలల కాలంలో 954 బెల్ట్ షాపులని గుర్తించి 964 మందిని అరెస్టు చేశామన్నారు. కాగా, జిల్లాలో అక్టోబర్ నుండి ఈరోజు వరకు సుమారు 811 కోట్ల రూపాయల మద్యం అమ్మకాలు జరిగాయని ఆయన వివరించారు.

===================

విశాఖ జిల్లాలో నూతన పరిశ్రమలు నెలకొల్పే పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం ఈరోజు కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు

సమన్వయంతో వ్యవహరించి వీలైనన్ని పారిశ్రామిక యూనిట్లు జిల్లాలో నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

===================

విశాఖ జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో జులై 9వ తేదీన జరిగే గిరిప్రదక్షిణ విజయవంతం చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి వి. త్రినాధరావు కోరారు.

===================

నైరుతి రుతుపవనాలతో రాగల నలభై ఎనిమిది గంటలలో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారి వివరిస్తూ..

(వాయిస్ బైట్...29 సెకన్లు)

===================

===================